ఇస్లాం శిక్షణ

# అల్లాహ్ ముస్లింల దేవుడా?

- హాఫిజ్ ఎస్.ఎమ్ రసూల్

## అల్లాహ్ ఎవరు?

అనేక మంది ఆరాధ్యుల్లో నుంచి తమకు నచ్చిన ఒక్కరిని ఎంచుకొని జీవితాంతం ఆయనకే కట్టుబడి ఉండటం కూడా ఏకదైవారాధనే అవుతుందని కొందరు అనుకుంటారు. ఇది పెద్ద పొరపాటు. ఈ పొరపాటు జరగకుండా ఉండాలంటే ముందుగా **"అల్లాహ్"** అనే పదానికి గల అర్థం ఏమిటో తెలుసుకోవాలి.

**"అల్లాహ్"** అనేది అరబీ భాషాపదం. ఇది **"అల్"** మరియు **"ఇలాహ్"** అనే రెండు పదాలు కలిసి ఏర్పడింది. అల్ అనేది ఇంగ్లీషులో వాడబడే **THE** వంటి ఉపపదము- ఆర్టికల్. దీని అర్థం నిర్దిష్టమైన, నిర్ణీతమైన, ప్రత్యేకమైన, ఇంతకు ముందు ప్రస్తావించబడిన, ఏకైక మరియు వాస్తవమైన అని.

ఇప్పుడు ఈ రెండు పదాలను (అల్+ఇలాహ్) ను కలుపుదాం అల్లాహ్ అనే పదం ఏర్పడింది. అదే విధంగా దాని ప్రత్యేక అర్థం కూడా ఉనికిలోకి వచ్చింది. అనగా నిజ ఆరాధ్యుడు, ఏకైక ఆరాధ్యుడు, సాటిలేని ఆరాధ్యుడు, అసలైన ఆరాధ్యుడు, అందరికి తెలిసిన ఆరాధ్యుడు. ఇస్లాం దృష్టిలో సర్వలోకాల సృష్టికర్త మాత్రమే ఆరాధనలకు అర్హుడు. మిగతా జీవరాశులు, ఇతర సృష్టిరాశులు ఆరాధనలకు అనర్హమైనవి. ఎందుకంటే అవి కూడా తమ సృష్టికర్త ద్వారా ఉనికిలోకి వచ్చినవే. అవన్నీ అల్లాహ్ ఆజ్ఞ మేరకు తమ కాలం వెళ్ళబుచ్చుతున్నవి మాత్రమే. అంతిమ లక్ష్యం వైపు పయనిస్తున్నవి మాత్రమే.

## అల్లాహ్ ముస్లింల దేవుడు మాత్రమే కాదు

అల్లాహ్ అంటే ముస్లిముల దైవం, ఇంకో పేరున మరో జాతి వారి దైవం అని జనం చెప్పుకుంటూ ఉంటారు. ఇది కూడా పొరపాటే. ఇస్లాం సర్వమానవాళిని ఒకే తల్లిదండ్రుల సంతానంగా పరిగణిస్తున్నది. వారందరి దైవం కూడా ఒక్కడే. ఆ దైవం మరియు ఆరాధ్యుని వివరణ మరియు విశ్లేషణ దివ్యఖుర్‌ఆన్‌లో ఇలా ఉన్నది: **"మీరు చెప్పండి! ఆయన, అల్లాహ్ అద్వితీయుడు(ఒక్కడే). అల్లాహ్ నిరపేక్షాపరుడు (ఎవరి ఆధారము, అక్కరా లేనివాడు, అందరూ ఆయనపై ఆధారపడేవారే). ఆయనకు సంతానము ఎవరూ లేరు మరియు ఆయన ఎవరి సంతానమూ కాదు. ఆయనకు సరిసమానులెవరూ లేరు."** (ఖుర్‌ఆన్ 112వ అధ్యాయం)

## విశ్వప్రభువుకు అన్నివిధాలా శోభాయమానమైన పదం 'అల్లాహ్'

తెలుగులో మనం **'దేవుడు'** అంటాం. అరబీలో **"అల్లాహ్"** అంటారు. ఇంగ్లీషులో గాడ్ (**God**) అని అంటారు. ఇలా మానవుల ఆరాధ్య దైవాన్ని ఒక్కో భాషలో ఒక్కో పేరుతో పిలుస్తుండవచ్చు. కాని ఇన్ని పదాల్లోకెల్లా **"అల్లాహ్"** అనేది ఎంతో విలక్షణమైన పదం. విశ్వప్రభువుకు అది అన్ని విధాలా శోభాయమానమైన పదం.

**'దేవుడు'** అనే పదం బహువచనమయితే దేవుళ్లు అయిపోతుంది. స్త్రీలింగమయితే దేవత అవుతుంది. అలాగే ఇంగ్లీషులో కూడా **God** అనే పదం **gods** మరియు **godess** అవటానికి ఆస్కారముంది. కాని నిజానికి మానవుల ఆరాధ్య దైవం ఎన్నటికీ ఒక్కడే. ఆయన అస్తిత్వాన్ని సూచించటానికి బహువచన పదం అక్కర్లేదు. అలాగే ఆ పదం స్త్రీ పురుష భేదాన్ని సూచించేటట్టుగా కూడా ఉండరాదు. అరబీ భాషలోని అల్లాహ్ అనే పదం విశ్వప్రభువుకు అన్ని విధాలా శోభాయమానమైనదని చెప్పవచ్చు.

## ఒక అపోహ

ముస్లిమేతరులకు ఇస్లాం గురించి వున్న అనేక పెద్ద అపోహల్లో **"అల్లాహ్"** అనే పదానికి సంబంధించిన అపోహ కూడా ఒకటి. ముస్లింలు క్రైస్తవుల, యూదుల దేవుణ్ణి కాకుండా వేరెవరో దేవుణ్ణి ఆరాధిస్తారని చాలా మంది అనుకుంటారు. కాని నిజానికి ఇదంతా ఓ అపోహ మాత్రమే. ఎందుకంటే **"అల్లాహ్"** అనే పదం దేవుడు అనే పదానికి పర్యాయపదం. దేవుడు అందరికీ ఒక్కడే.

దేవుడు ఎవరు? ఆయన అస్తిత్వం ఏమిటి? అనే విషయాల్లో యూదులు- క్రైస్తవులు-ముస్లింల మధ్య భేదాభిప్రాయాలున్నాయి, ఉదా; యూదులు క్రైస్తవుల్లో ఉన్న త్రిత్వభావన (**Trinity**) ను తిరస్కరిస్తారు. ముస్లింలు కూడా దాన్ని తిరస్కరిస్తారు. అంతమాత్రంచేత ఆ మూడు మతాలకు ముగ్గురు వేర్వేరు దేవుళ్ళు ఉన్నారని అర్థం కాదు. ఎందుకంటే -విశ్వమంతటికి నిజదేవుడు ఒక్కడే. ఇస్లాం చెప్పేది ఏమిటంటే- ఇతర మతాలవాళ్లు కూడా అల్లాహ్‌నే విశ్వసిస్తున్నారు. కాని అల్లాహ్‌ను ఏ విధంగా విశ్వసించాలో ఆ విధంగా విశ్వసించటం లేదు. దేవుడు ఫలానా విధంగా ఉంటాడని స్వయంగా కల్పనలు చేసుకుని విశ్వసిస్తున్నారు.

## సీరత్ క్విజ్

? **ప్రవక్త(స) పెదనాన్న 'అబూతాలిబ్' ఇస్లాం ధర్మాన్ని స్వీకరించారా?**

జ : లేదు. ఆయన ఇస్లాం స్వీకరించలేదు. బహుదైవారాధకునిగానే మరణించారు.

? **ప్రవక్త(స) గారి నామాంతరమేది?**

జ : అబుల్ ఖాసిం. పెద్ద కుమారుని పేరు ఖాసిం. అరబ్బు సాంప్రదాయం ప్రకారం పురుషులు పెద్దకుమారుని తండ్రిగా పిలవబడతారు.

? **నేను దైవమార్గంలో బలి ఇవ్వబడిన ఇద్దరుల మహనీయుల వారసుడ్ని" అని చెప్పిన వారెవరు?**

జ : ముహమ్మద్(స). ఇబ్రాహీం (అలై) కుమారుడు ఇస్మాయీల్(అలై) మరియు అబ్దుల్ ముత్తలిబ్ కుమారుడు అబ్దుల్లాహ్ - ఇద్దరూ అల్లాహ్ కొరకై బలి ఇవ్వడానికి సిద్ధమైన తరువాత అల్లాహ్ వారికి బదులుగా వేరే జంతువులను బలి ఇప్పించి వారిద్దరినీ రక్షించాడు.

? **మహాప్రవక్త(స) పేరు విన్న తరువాత ఏమని చెప్పాలి?**

జ: ప్రవక్త(స) పేరు విన్న లేదా చదివిన తరువాత "సల్లల్లాహు అలైహి వసల్లం" (అల్లాహ్ ఆయనపై శాంతి, శుభాల వర్షం కురిపించుగాక) అని చెప్పాలి.

? **కాబా అంటే అర్థం?**

జ: అల్లాహ్ దాస్యం కోసం భూమండలంపై మొట్టమొదటిసారి నిర్మించబడిన అతి ప్రాచీన దైవగృహం.